# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం 30 ఆగస్టు 2025 | www.balagamtv.com | పేజీలు 4


## అసెంబ్లీ సమావేశాలకు సహకరించాలి

- శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర అసెంబ్లీ, మండలి సమావేశాలు సజావుగా సాగేందుకు అందరూ సహకరించాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. గతంలో మాదిరిగానే రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, పోలీసు శాఖ, శాసనసభాధికారులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు. తెలంగాణ శాసనసభ, శాసనమండలి సమావేశాల నేపథ్యంలో నిర్వహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై శుక్రవారం ప్రభుత్వాధికారులు, పోలీసు శాఖాధికారులతో ఉన్నతస్థాయి సమావేశం శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఆయా శాఖలపై చర్చ జరుగుతున్నప్పుడు సంబంధితాధికారులు అందుబాటులో ఉంటూ మంత్రులకు, సభ్యులకు తగిన సమాచారం అందించాలని సూచించారు. వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జనాల నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమావేశాలు సజావుగా నిర్వహించడానికి పోలీసు శాఖ తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే భారీ వర్షాలు కురిసి కొన్ని ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్నాయన్నారు. ట్రాఫిక్

మిగితా 2వ పేజీలో

## భారత్-జపాన్ ఆర్థిక, రక్షణ భాగస్వామ్యం

- ¥10 ట్రిలియన్ పెట్టుబడుల లక్ష్యం

**బలగం టీవీ, టోక్యో**

భారత్ మరియు జపాన్ శుక్రవారం టోక్యోలో జరిగిన వార్షిక సమ్మిట్‌లో 10 ఏళ్ల ఆర్థిక, వ్యూహాత్మక సహకారం ప్రణాళికను ప్రకటించాయి. జపాన్, వచ్చే దశాబ్దంలో భారతదేశంలో¥10 ట్రిలియన్ (సుమారు %$%68 బిలియన్) పెట్టుబడులు పెట్టడానికి సంకల్పించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మరియు జపాన్ ప్రధాని షిగెరు ఇషిబా కొత్తగా ఎకనామిక్ సెక్యూరిటీ ఇనిషియేటివ్ ప్రారంభించారు. ఇది సెమీకండక్టర్స్, డిజిటలైజేషన్, టెలికాం, ఫార్మాస్యూటికల్స్, రేర్ ఎర్త్‌లు, ఎమర్జింగ్ టెక్నాలజీస్ వంటి కీలక రంగాల్లో అనుసంధానాన్ని పెంచేందుకు దోహదపడుతుంది.అంతేకాదు, సెక్యూరిటీ కోఆపరేషన్ జాయింట్ డిక్లరేషన్పై కూడా సంతకం చేశారు, దక్షిణ చైనా సముద్రం, తూర్పు చైనా సముద్రం వంటి ప్రాంతాల్లో ఏర్పడుతున్న భద్రతా పరిస్థితులను ఎదుర్కొనడంలో ఇరు దేశాలను ప్రోత్సహించే విధంగా ఉంది.



**సమ్మిట్ ముఖ్యాంశాలు:**

పెట్టుబడుల లక్ష్యం: జపాన్, భారతదేశంలో ¥10 ట్రిలియన్ పెట్టుబడులు కొనసాగించనుంది. 2022-26లో ¥5 ట్రిలియన్ లక్ష్యాన్ని 2 సంవత్సరాల ముందే సాధించింది.

హై-స్పీడ్ రైలు ప్రాజెక్ట్: ముంబై-ఆహ్మదాబాద్ బుల్లెట్ రైలు పనులను వేగవంతం చేయడానికి ఒప్పందం. జపాన్, ఈ10 షింకన్సెన్ సిస్టమ్‌ను 2030లో ప్రవేశపెట్టనుంది.

రక్షణ, భద్రత: భారత్-జపాన్ సైనిక భాగస్వామ్యం బలోపేతం. దక్షిణ, తూర్పు చైనా సముద్రంలో ఏకపక్ష చర్యలను వ్యతిరేకించడానికి కట్టుబాటు.

సాంకేతిక సహకారం: డిజిటల్ పార్టనర్‌షిప్ 2.0 మరియు ఏఐ కోఆపరేషన్ ఇనిషియేటివ్ ప్రారంభం. అంతరిక్ష రంగంలో ISRO-JAXA Chandrayaan -5 ప్రాజెక్ట్‌లో సహకారం.

మానవ వనరుల మార్పిడి: ఐదు సంవత్సరాల్లో 500,000 మంది వృత్తిపరుల మార్పిడిబీ 50,000 మంది భారత నిపుణులు జపాన్ ఆర్థిక వ్యవస్థకు సహకారం.

నెక్స్ట్ జెనరేషన్ మొబిలిటీ: పోర్టులు, ఎయిర్‌వేస్, షిప్‌బిల్డింగ్‌లో భాగస్వామ్యం పెంపు.

ప్రధానమంత్రి మోడీ, భారత్-జపాన్ భాగస్వామ్యం నిర్వహణా విశ్వాసం, పంచుకున్న విలువలు ఆధారంగా ఉందని తెలిపారు. జపాన్ సాంకేతికత, భారత ప్రతిభ కలయికను "విన్నింగ్ కాంబినేషన్" అని అభివర్ణించారు. ఇషిబా, ప్రాంతీయ శాంతి, స్థిరత్వం కోసం ఇరు దేశాలు తమ శక్తులను కలపాలని స్పష్టం చేశారు. ఈ సమ్మిట్, ఆసియాలో భారత్-జపాన్ సంబంధాలను స్థిరత్వానికి మూలస్తంభంగా మరల పెంచినట్లు పేర్కొన్నారు.

ప్రపంచ శాంతి, స్థిరత్వానికి భారత్-జపాన్ మధ్య సంబంధాలు చాలా కీలకమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. శుక్రవారం టోక్యోలో భారత్-జపాన్ జాయింట్ ఎకనామిక్ ఫోరంలో మోడీ ప్రసంగించారు. జపాన్ సాంకేతికత, భారత్ ప్రతిభ

మిగితా 2వ పేజీలో

## విద్యా బోధనలో నాణ్యత ప్రమాణాలు పెంచాలి

- విద్యార్థులు, బోధన సిబ్బందికి ఫేషియల్ రికగ్నేషన్ తప్పనిసరి
- ఒకే విభాగం పరిధిలోకి విద్యా శాఖ పరిధిలోని నిర్మాణాలు
- గ్రీన్ ఛానల్‌లో మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపు
- ప్రతి విద్యా సంస్థలో క్రీడలకు ప్రాధాన్యం....
- విద్యా శాఖ సమీక్షలో ఎ.రేవంత్ రెడ్డి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

పాఠశాలలు మొదలు విశ్వ విద్యాలయాల వరకు ప్రతి విద్యా సంస్థలోనూ మెరుగైన బోధన సాగాలని.. విద్యా బోధనలో నాణ్యత ప్రమాణాలు మరింతగా పెంచాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రొఫెషినల్ కోర్సులు బోధించే కళాశాలల్లో విద్యార్థులు, బోధన సిబ్బందికి ఫేషియల్ రికగ్నేషన్ తప్పనిసరి చేయాలని సీఎం ఆదేశించారు. ముఖ గుర్తింపుతో హాజరు శాతం మెరుగవడంతో పాటు ప్రొఫెషనల్ విద్యా సంస్థల్లో లోటుపాట్లను అరికట్టవచ్చన్నారు. విద్యా శాఖపై ఐసీసీసీలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. విద్యా శాఖ పరిధిలో అదనపు గదులు, వంట గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణం వివిధ విభాగాలు చేపట్టడం సరికాదని సీఎం అభిప్రాయపడ్డారు. ఈ నిర్మాణాల నాణ్యతప్రమాణాలు, నిర్మాణ పర్యవేక్షణ, నిధుల మంజూరు, జవాబుదారీతనానికి గానూ ఒకే విభాగం కింద ఉండాలన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న విద్యా, సంక్షేమ వసతుల అభివృద్ధి సంస్థ కిందనే రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థల నిర్మాణాలు కొనసాగాలని సీఎం ఆదేశించారు. ఈ సంస్థకు అవసరమైన ఇంజినీరింగ్, ఇతర సిబ్బందిని ఇతర విభాగాల నుంచి వెంటనే డిప్యూటేషన్‌పై తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపును గ్రీన్ ఛానల్‌లో చేపట్టాలని... ఈ విషయంలో ఎటువంటి అలసత్వం చూపొద్దని సీఎం అన్నారు. తెలంగాణలోని మహిళా కళాశాలలు, బాలికల పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. కంటైనర్ కిచెన్లకు ప్రాధాన్యమివ్వాలని.. కంటైనర్లపైన సోలార్ ప్యానెళ్లతో అవసరమైన విద్యుత్ వినియోగించుకోవచ్చని సీఎం తెలిపారు. ప్రతి పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. అవసరమైతే కాంట్రాక్ట్ పద్ధతిన వ్యాయామ ఉపాధ్యాయులను నియమించే అంశాన్ని పరిశీలించాలని అధికారులను సీఎం ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద పాఠశాలల్లో పారిశుధ్య పనులకు సంబంధించిన బిల్లులు తక్షణమే విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. సంక్షేమ గురుకుల పాఠశాలల్లోని బాలికలకు వివిధ అంశాలపై కౌన్సెలింగ్ ఇచ్చేందుకు మహిళా కౌన్సెలర్లను నియమించాలని సీఎం సూచించారు. విద్యా రంగంపై పెడుతున్న ఖర్చును తాము ఖర్చుగా కాక పెట్టుబడిగా చూస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూళ్లతో పాటు విద్యా రంగం అభివృద్ధికి తీసుకునే రుణాలను ఎఫ్ఆర్‌బీఎం పరిమితిలో లేకుండా చూడాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారని సీఎం తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న వారిలో 90 శాతానికి పైగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలే ఉన్నారని, ఈ విషయాన్ని నిర్ధారించేందుకు గత పదేళ్లలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివిన వారి వివరాలపై నివేదిక రూపొందించాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేములు శ్రీనివాసులు, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు

## నేటి నుంచి అసెంబ్లీ



- ఉదయం 10.30 గంటలకు ప్రారంభం
- జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు సంతాపం
- అనంతరం వాయిదా
- మధ్యాహ్నం క్యాబినెట్ భేటీ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

అసెంబ్లీ సమావేశాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 10.30 గంటలకు శాసనసభ, మండలి కొలువుదీరనున్నాయి. ఇటీవల మరణించిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు శాసనసభ సంతాపం ప్రకటించనుంది. ఆయనకు నివాళులర్పిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు, బీఆర్ఎస్ సభ్యులు ప్రసంగిస్తారు. అనంతరం సభ వాయిదా పడనుంది. ఆ తర్వాత స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన సభా వ్యవహారాల కమిటీ (బీఏసీ) సమావేశమై అసెంబ్లీని ఎన్ని రోజులు నడపాలనే విషయమై చర్చించి, ఒక నిర్ణయానికి వస్తుంది. సమావేశాలను నాలుగైదు రోజులపాటు నిర్వహించే అవకాశముందని అధికార పార్టీ వర్గాలు చెబుతున్నాయి. శాసనసభా సమావేశాల్లో కాళేశ్వరం కమిషన్ రిపోర్టును ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. సభలోని ఎమ్మెల్యేలందరికీ ఆ నివేదిక కాపీలను అందజేయనున్నారు. మండలిలో ఎమ్మెల్సీలకు కూడా ఆ కాపీలను అందజేస్తారు.

మరోవైపు శనివారం మధ్యాహ్నం రెండున్నర గంటలకు అసెంబ్లీ కమిటీ హాల్‌లో రాష్ట్ర మంత్రివర్గం భేటీ కానుంది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లే ప్రధాన అజెండాగా క్యాబినెట్ భేటీ జరగనుంది. బీసీ రిజర్వేషన్లపై అధ్యయనం కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం నివేదికపై కూడా క్యాబినెట్ చర్చించనుంది.

కాళేశ్వరం కమిషన్ రిపోర్టును శాసనసభ, మండలిలో ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఉభయ సభల్లో వాడివేడి చర్చ జరగనుంది. రిపోర్టు ఆధారంగా ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌ను ఇరకాటంలో పెట్టేందుకు అధికార పక్షం కాంగ్రెస్ వ్యూహాలను పన్నుతుండగా, వాటిని ధీటుగా ఎదుర్కొనేందుకు గులాబీ పార్టీ సమాయత్తమవుతోంది. అధికార పార్టీ ఎదురుదాడి చేయనున్న నేపథ్యంలో ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ ఈసారైనా సభకు వచ్చి ఆ దాడిని తిప్పికొడతారా? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది. దీనిపై తెలంగాణ భవన్ నుంచి గానీ, బీఆర్ఎస్ వైపు నుంచి గానీ ఎలాంటి అధికారిక సమాచారం వెలువడకపోవటం గమనార్హం. ఒకవేళ కేసీఆర్ సభకు రాకపోతే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆ బాధ్యతను భుజానికెత్తుకుని కాళేశ్వరం రిపోర్టుపై తమ పార్టీ తరపున చర్చలో పాల్గొని, వాదనలను సమర్థవంతంగా వినిపించాల్సి ఉంటుంది. ఈ అంశంపై సభలో తమకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ (పీపీపీ)కు అవకాశమివ్వాలంటూ ప్రధాన ప్రతిపక్షం స్పీకర్‌కు ఇప్పటికే విజ్ఞప్తి చేసింది. దీనిపై ప్రభుత్వం ఏ రకంగా స్పందిస్తుందో చూడాలి. ఒకవేళ సర్కారు అనుమతినివ్వకపోతే అదే అదనుగా సభలో ఆందోళన చేపట్టాలని బీఆర్ఎస్ యోచిస్తోంది. ఈ నేపథ్యంలో సభ మరింత హీటెక్కటం ఖాయంగా కనబడుతోంది.

### జీఎస్టీ రేషనలైజేషన్‌తో
## రాష్ట్రాలకు భారీ నష్టం




- తెలంగాణకే రూ.7 వేల కోట్ల వరకు ఆదాయం కోత
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఢిల్లీ లో జరిగిన సమావేశంలో జీఎస్టీ రేషనలైజేషన్ అంశంపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. ఈ సమావేశానికి ఎనిమిది రాష్ట్రాల మంత్రులు హాజరయ్యారు. ఇందులో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాటా ్లడుతూ, రేట్ రేషనలైజేషన్ పేరుతో రాష్ట్రాలకు భారీ రెవెన్యూ నష్టం సంభవించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆయన తెలిపారు, "అన్ని రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులు బాగుంటేనే దేశం బాగుంటుంది. కేంద్రం ఫెడరల్ స్ఫూర్తితో వ్యవహరించాలి. రేషనలైజేషన్‌ను మేము ఆహ్వానిస్తున్నాం కానీ, రాష్ట్రాలకు జరిగే నష్టానికి తగిన నష్టపరిహారం చెల్లించే మార్గాలను కేంద్రం ఆలోచించాలి" అని స్పష్టం చేశారు.

జీఎస్టీ ద్వారా రాష్ట్రాలకు వచ్చే ఆదాయంపై ఎన్నో ప్రణాళికలు ఆధారపడి ఉంటాయని భట్టి గుర్తుచేశారు. ముఖ్యంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని చెప్పారు. తెలంగాణకే సుమారు 7 వేల కోట్ల రూపాయల నష్టం తలెత్తే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జీఎస్టీని అమలు చేసే సమయంలో కేంద్రం రాష్ట్రాలకు కనీసం 14 శాతం వృద్ధి హామీ ఇస్తామని చెప్పినా, వాస్తవానికి ఇప్పటికీ 7 శాతం మాత్రమే వృద్ధి వస్తోందని భట్టి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రాలకు తగిన నష్టపరిహారం చెల్లించాలని, సెస్ రూపంలో వచ్చే ఆదాయాన్ని రాష్ట్రాలకే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎనిమిది రాష్ట్రాలు ఏకగ్రీవంగా కేంద్రం చర్యలు తీసుకోవాలని నిర్ణయించాయి. సెప్టెంబర్ 3న జరగనున్న జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఈ డిమాండ్లను లేవనెత్తాలని నిర్ణయించారు. అలాగే, అదే రోజు మళ్లీ ఆర్థిక మంత్రుల సమావేశం ఢిల్లీలో జరగనుంది.

## మోడీ హయాంలో ఆర్థిక విప్లవం

- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



ప్రధాని నరేంద్ర మోడి హయాంలో దేశంలో ఆర్థిక విప్లవం వచ్చిందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. 11 సంవత్సరాల్లో 278 రేట్లు పెరిగిన బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్లు, బ్యాంకు అకౌంట్లు అని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా 56 కోట్ల జన్‌ధన్ ఖాతాల్లో రూ. 2.68 లక్షల కోట్ల నగదు జమ అయినట్లు ఆయన తెలిపారు. తెలంగాణలో 1.3 కోట్ల జనధన్ అకౌంట్లలో రూ.5.-055.35 కోట్లు జమ చేసినట్లు ఆయన వివరించారు. సామాన్యులకు బ్యాంకు సేవలు అందుబాటులోకి వచ్చాయని ఆయన తెలిపారు. సమ్మిళిత ఆర్థికాభివృద్ధిని పెంపొందించడంతో పాటు కోట్లాది మందికి, ముఖ్యంగా మహిళలకు, యువతకు, అణగారిన వర్గాలకు గౌరవాన్ని అందించే లక్ష్యంతో ప్రధాని మోడి తీసుకుని వచ్చిన జన్‌ధన్ పథకం 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్నదని ఆయన వివరించారు. దేశంలోని అనేక మంది బడుగు, బలహీన, పేద ప్రజలకు బ్యాంకు ఖాతాలు కూడా ఉండేవి కాదని ఆయన తెలిపారు. దీంతో ప్రధాని నరేంద్ర మోడి 2014 సంవత్సరం ఆగస్టు 28న జన్‌ధన్ పథకాన్ని తీసుకుని వచ్చారని ఆయన వివరించారు. 2014 సంవత్సరానికి ముందు దేశవ్యాప్తంగా మొత్తం 3.35 బేసిక్ సేవింగ్స్ అకౌంట్లు మాత్రమే ఉండగా, వాటిలో ఖాతాదారులు జమ చేసుకున్న మొత్తం రూ. 960 కోట్లు మాత్రమేనని ఆయన తెలిపారు. నరేంద్ర మోడి ప్రధాని అయిన తర్వాత ప్రజలందరినీ బ్యాంకింగ్ వ్యవస్థలోకి, సమ్మిళిత ఆర్థిక వ్యవస్థలోకి తీసుకొచ్చేందుకు సంస్కరణలు తీసుకుని వచ్చినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వివరించారు.

## తెలంగాణ క్రీడా కార్యక్రమాలు దేశానికి ఆదర్శం

- ధ్యాన్ చంద్ జీవితము క్రీడా రంగానికి స్ఫూర్తి
- రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి
- క్రీడా దినోత్సవం సందర్భంగా పలువురికి నగదు పురస్కారాలు

వివరాలు 2వ పేజీలో

### ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే
## విలాసవంతమైన ప్రాజెక్టులపై సమీక్షలా..?

- అభినవ నీరో రేవంత్
- ప్రజలు సాయం కోసం చూస్తున్నారు
- స్కాలర్‌షిప్ బకాయిలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

భారీ వర్షాలతో ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే.. సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం విలాసవంతమైన ప్రాజెక్టులపై సమీక్షలు చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. " కనీవినీ ఎరుగని భారీ వర్షాల వల్ల తెలంగాణలో జన జీవనం స్తంభించిపోయింది. భారీగా ప్రాణనష్టం, ఆస్తినష్టం జరిగింది. ప్రజలు బిక్కుబిక్కు మంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని సహాయచర్యల కోసం ఎదురుచూస్తున్నారు. అభినవ నీరో రేవంత్ మాత్రం రూ. 3,50,000 కోట్ల 2036 ఒలంపిక్స్ నిర్వహణ, రూ. 1,50,000 కోట్ల మూసీ సుందరీకరణ , రూ. 225 కోట్ల హైదరాబాద్ బీచ్ ప్రాజెక్టు సమీక్షలు చేస్తున్నాడు. ప్రజల గోడు గాలికి వదిలేసి కాసులు కురిపించే పనులమీదనే రేవంత్ అండ్ కో దృష్టి అంతా. నవ్విపోదురు కాక నాకేంటి సిగ్గు అనేలా ఉంది కాంగ్రెస్ మార్క్ ప్రజాపాలన!" అని పేర్కొన్నారు.

**స్కాలర్‌షిప్ బకాయిలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం : కేటీఆర్**

స్కాలర్‌షిప్ బకాయిలపై అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని నిజాం కాలేజీ విద్యార్థిని సుమన ఎక్స్ వేదికగా కేటీఆర్‌కు అభ్యర్థన చేయగా.. ఆయన స్పందించారు. ఈ అంశాన్ని తన దృష్టికి తీసుకొచ్చినందుకు థ్యాంక్యూ చెప్పారు కేటీఆర్.విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో మీరు అత్యంత చురుకైన నాయకులలో ఒకరు. నిజాం కళాశాల పూర్వ విద్యార్థిగా, మీరు ఎక్స్ వేదికగా మా సమస్యలను ముందుగానే పరిష్కరించారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌ల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మేము మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాము అని సుమన అనే విద్యార్థిని ట్వీట్ చేశారు. ఇటీవలే నేను నిజాం కాలేజీ నుంచి డిగ్రీ పూర్తి చేశాను. టీసీ తీసుకునేందుకు వెళ్తే.. ఆర్టీఎఫ్ రూ. 28 వేలు, ఎంటీఎఫ్ రూ. 14 వేలు చెల్లించాలని అడిగారు. ఇప్పటి వరకు తమకు ఫైనల్ ఇయర్ స్కాలర్‌షిప్ చెల్లించలేదు. మాది మధ్య తరగతి కుటుంబం.. దయచేసి తక్షణమే స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని కోరుతున్నట్లు సుమన్ ప్రభుత్వాన్ని కోరారు.

## నీట మునిగిన పంటలు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

వర్షాలతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులకు కష్టాలు తప్పడం లేదు. లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. అనేక ప్రాంతాల్లో పొలాల్లో ఇసుక మేటలు భారీగా వేశాయి. ప్రధానంగా నిర్మల్ జిల్లావ్యాప్తంగా రాత్రి నుంచి తెరిపి లేకుండా కురిసిన వర్షానికి వాగులు, వంకలు ఉధృతంగా ఉప్పొంగుతున్నాయి. తానూర్ మండలంలోని కొలుర్, బోల్స, మహాలింగి గ్రామాలలోకి వరద చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లో-లెవల్ వంతెనలు, రోడ్లపై వరద ఉధృతంగా ఉరకలెత్తుతోంది. భైంసా మండలంలోని గుండెగం వద్ద రంగారావు ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో మహాగం, చాత గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. కుబీర్‌లో విఠలేశ్వర ఆలయం, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని వరద చుట్టు ముట్టింది. బాసర మండలంలోని టాక్లి గ్రామానికి వెళ్లే రోడ్డు కోతకు గురికావడంతో అక్కడ అంబులెన్స్ చిక్కుకుపోయింది. ఉదయంపూట తగ్గిన వరద మళ్లీ పెరుగడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు.

బాసర వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుంది. ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి ఉప్పొంగుతుండటంతో పుష్కరఘాట్‌లోని చివరి మెట్టును ఆనుకోని నది ప్రవహిస్తోంది. గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పుణ్యస్నానాలకి భక్తులను నదిలోకి భక్తులను అక్కడి సిబ్బంది అనుమతించలేదు. గోదావరి ఘాట్ వెళ్లే మార్గంలోని మూడు లాడ్జిలు, ఓ భవనం జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రాత్రి జేసీబీ సాయంతో 9 మందిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. మరికొందరు అక్కడే పై అంతస్థులో ఉన్నారు. క్రమంగా వరద పెరగడంతో గంగపుత్రులు తెప్పల ద్వారా మరో నలుగురిని రక్షించారు. మరో అద్దె భవనంలో 7 కుటుంబాలు చిక్కుకోగా ఎస్డీఆర్ఎఫ్ బృందం 20 మందిని కాపాడింది. మరోవైపు గడ్డెన్నవాగు ప్రాజెక్టు గేట్లెత్తడంతో సుద్దవాగులో వరద మరింత పెరిగింది. భైంసాలోని ఆటోనగర్, బస్ డిపో, రాహుల్ నగర్ , వివేకానంద చౌరస్తాలోకి పెద్ద ఎత్తున నీరు చేరింది. స్థానికులను అప్రమత్తం చేసిన అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించారు.

తెలంగాణలో భారీ వర్షాల కారణంగా 270 మండలాలు, 2,463 గ్రామాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ ఈ మేరకు వెల్లడించింది. వర్షాలతో వరి, మొక్కజొన్న, టమాట, పత్తి, కంది పంటలకు నష్టం వాటిల్లినట్లు పేర్కొంది. మొత్తం 2లక్షల 20 వేల 443 వందల ఎకరాల్లో పంటలు దెబ్బతినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లాలవారీగా పంట నష్టంపై ప్రభుత్వానికి రిపోర్టు సమర్పించినట్లు వెల్లడించారు. నివేదిక ప్రకారం లక్షా 9 వేల 626 వందల ఎకరాల్లో వరి, 60 వేల 80 ఎకరాల్లో పత్తి, 6 వేల 751 ఎకరాల్లో సోయాబీన్, 639 ఎకరాల్లో ఉద్యానవన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

## సెప్టెంబర్ 2 వరకు వానలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో సెప్టెంబర్ 2 వరకు వానలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. తేలికపాటి నుంచి భారీ వర్షాలు పడే సూచనలున్నాయని చెప్పింది. శనివారం ఆదిలాబాద్, కొత్తగూడెం, హన్మకొండ, జగిత్యాల్య, భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, వరంగల్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది.ఆదివారం రోజున ఆదిలాబాద్, కొత్తగూడెం, హన్మకొండ, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, వరంగల్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది. హైదరాబాద్, జనగాం, జోగులాంబ గద్వాల, మహబూబ్‌నగర్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, నాగర్ కర్నూల్, నారాయణపేట, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ బలమైన ఈదురుగాలులు వీచే అవకాశాలున్నాయని పేర్కొంది. సెప్టెంబర్ ఒకటిన ఆదిలాబాద్, కొత్తగూడెం, హన్మకొండ, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, ఆసిఫాబాద్, ములుగు, వరంగల్, జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడుతాయని తెలిపింది.సెప్టెంబర్ 2న ఆదిలాబాద్, కొత్తగూడెం, హన్మకొండ, హైదరాబాద్, జగిత్యాల, జనగాం, భూపాలపల్లి, గద్వాల, కామారెడ్డి, కరీంనగర్, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, మెదక్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, ములుగు, నాగర్ కర్నూల్, నారాయణపేట, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్, వనపర్తి, వరంగల్, భువనగిరి జిల్లాల్లో వర్షాలు పడే సూచనలున్నాయని వివరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మెదక్, కరీంనగర్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా కామారెడ్డి జిల్లాల్లో గాంధారి మండల కేంద్రంలో 27.4, సర్వాపూర్‌లో 27.4 సెంటీమీటర్ల భారీ వర్షాపాతం నమోదైందని టీజీడీపీఎస్ వివరించింది.

# చేయూత పింఛన్ల పంపిణీలో సాంకేతిక విప్లవం

- **సత్వర సేవల కోసం నూతన విధానంలో పెన్షన్ల పంపిణీకి శ్రీకారం**
- **పోస్ట్ మాస్టర్లకు 5జీ మొబైల్ ఫోన్ల అందజేత**
- **కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించిన మంత్రి సీతక్క**
- **రాష్ట్రవ్యాప్తంగా 6300 మంది పోస్టుమాస్టర్లకు 5జీ మొబైల్ ఫోన్లు, ఎల్1 ఫింగర్ ప్రింట్ మెషీన్లు**

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని చేయూత సామాజిక భద్రతా పింఛన్ల పథకంను అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, వితంతులు, ఒంటరి మహిళలు, హెచ్ఐవీ, డయాలసిస్ భాదితులు, గీత కార్మికులు, బీడీ కార్మికులకు ఆర్థిక భరోసా లభిస్తోంది. ప్రస్తుతం మొత్తం పదకొండు రకాల పింఛన్లు చేయూత పథకం కింద ప్రభుత్వం అందజేస్తుంది.

ఇప్పటి వరకు పింఛన్ దారుల ధృవీకరణ కోసం 2జీ ఆధారిత ఫింగర్ ప్రింట్ పరికరాలను వినియోగిస్తున్నారు. ఇప్పుడు వాటి స్థానంలో ఆధునిక సాంకేతికతతో కూడిన ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు సాఫ్ట్‌వేర్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ కొత్త విధానం ద్వారా "సరైన వ్యక్తికి – సరైన పింఛన్ – సరైన సమయంలో" అందేలా పింఛన్ పంపిణీ మరింత ఖచ్చితంగా, పారదర్శకంగా మారనుంది.

ఈ కార్యక్రమం కోసం ప్రభుత్వం రూ.15.50 కోట్ల బడ్జెట్‌తో 5జీ ఆధారిత ఎల్ 1 ఫింగర్ ప్రింట్ పరికరాలు, కొత్త మొబైల్ ఫోన్లను కొనుగోలు చేసింది. ప్రయోగాత్మకంగా కొన్ని జిల్లాల్లో ఈ పరికరాలను ప్రభుత్వం వినియోగించింది. ఆశించిన ఫలితాలు రావడంతో రాష్ట్రవ్యాప్తంగా 6,300 బ్రాంచ్ పోస్టుమాస్టర్లకు స్మార్ట్ మొబైల్ ఫోన్లు, పరికరాలు పంపిణీ చేయనున్నారు. స్మార్ట్ మొబైల్ ఫోన్లు పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ములుగు జిల్లాలోని పస్రా కేంద్రంలో ములుగు జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర్ తో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. కొద్ది రోజుల్లోనే రాష్ట్ర వ్యాప్తంగా 6300 మంది పోస్టుమాస్టర్లకు పరికరాలను అందజేయనున్నారు.

ఫేస్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్‌ను టీజీ ఆన్‌లైన్ పత్యేకంగా అభివృద్ధి చేసింది. కొత్త సాంకేతిక పరిష్కారం వల్ల పింఛన్ దారుల ధృవీకరణ సమయం మూడు సెకన్లకు తగ్గి, పింఛన్లు వేగంగా పంపిణీ అవుతాయి. దీంతో లబ్ధిదారులు ఎక్కువసేపు వేచి ఉండాల్సిన అవసరం లేకుండా వెను వెంటనే తమ పింఛన్లు అందుకుంటారు. ముఖ్యంగా వ్యవసాయ కూలీలు, వృద్ధులు, వేలిముద్రలు చెరిగిన వారు వంటి వారికి ముఖ గుర్తింపు యాప్ ఎంతో మేలు చేస్తోంది.

ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచే దిశగా ఈ పథకం డిజిటల్ రూపాంతరం పొందటం ద్వారా పింఛన్ పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, వేగం పెరిగి పింఛన్ దారులకు సత్వర సేవలు అందుతాయని మంత్రి సీతక్క ప్రకటించారు. పించన్దారుల సమస్యల దృష్టిలో పెట్టుకొని ఈ నూతన విధానాన్ని ప్రవేశపెట్టినట్లు మంత్రి సీతక్క తెలిపారు.

# ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన భార్య..!

- **సరూర్‌నగర్‌లో దారుణం**
- **నిందితురాలు అరెస్ట్**

**బలగం టీవీ, హైదరాబాద్**

నగరంలోని సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘోర హత్య వెలుగులోకి వచ్చింది. వివాహేతర సంబంధం కారణంగా భార్య తన ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన ఘటన కలకలం రేపుతోంది. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన శేఖర్ దంపతులు 16 సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నారు. బతుకుదెరువు కోసం వీరిద్దరూ హైదరాబాద్‌కి వచ్చి సరూర్‌నగర్‌లో నివసిస్తున్నారు. శేఖర్ ప్రైవేటు డ్రైవర్‌గా పనిచేస్తుండగా, భార్య ఇళ్లలో పని చేసేది. తాజాగా శేఖర్, భార్య వివాహేతర సంబంధంపై ప్రశ్నించడంతో ఆమె కోపోద్రిక్తురాలైంది. ప్రియుడు హరీశ్ సహకారంతో భర్తను చంపేయాలని పథకం వేసిందని తెలిసింది. అర్ధరాత్రి హరీశ్‌ను ఇంటికి పిలిపించి నిద్రలో ఉన్న శేఖర్‌ను దారుణంగా హతమార్చినట్టు సమాచారం హత్య అనంతరం 100కు ఫోన్ చేసి భర్త నిద్రలోనే చనిపోయాడని చెప్పి పోలీసులను తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నించిందని తెలిసింది. అయితే విచారణలో అనుమానం వచ్చిన పోలీసులు తమదైన శైలిలో ప్రశ్నించగా, చిట్టి నేరాన్ని ఒప్పుకుందని తెలిసింది. ప్రస్తుతం నిందితురాలు పోలీసుల అదుపులో ఉండగా, పరారీలో ఉన్న ప్రియుడు హరీశ్ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు వెల్లడించారు.

# తెలంగాణ క్రీడా కార్యక్రమాలు దేశానికి ఆదర్శం

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత క్రీడలకు చిరస్థాయిగా ప్రేరణ నిచ్చిన మహానుభావుడు ధ్యాన్ చంద్ స్ఫూర్తితో క్రీడా సమాజం ముందుకెళ్లాలని తెలంగాణ రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గచ్చిబౌలి స్టేడియంలో జరిగినజాతీయ క్రీడా దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన అద్భుతమైన క్రీడా ప్రతిభతో వరుసగా మూడు ఒలంపిక్స్ గోల్డ్ మెడల్ సాధించిన ధ్యాన్ చంద్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి క్రీడాకారుడు ఒలంపిక్స్ మెడల్స్ లక్ష్యంగా ముందుకెళ్లాలని ఆయన అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇస్తున్న ప్రోత్సాహాన్ని అందుకొని తెలంగాణలో ఒలంపిక్స్ క్రీడలు నిర్వహించడమే కాదు ఒలంపిక్స్ పతాకలు సాధిం చడంలో కూడా తెలంగాణ క్రీడాకారులు ముందుండాలని మంత్రి అన్నా రు. నూతన క్రీడా విధానం ఇస్తున్న ప్రోత్సాహంతో క్రీడాకారులు తమ ప్రతిభను చాటి తెలంగాణ రాష్ట్రానికి వన్నె తేవాలని ఆయన కోరారు.స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ, దేశంలో ఏ రాష్ట్రం నిర్వహించనంత ఘనంగా తెలంగాణ రాష్ట్రంలో తొమ్మిది రోజులపాటు,అత్యంత ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలు నిర్వహించి క్రీడా స్ఫూర్తిని చాటుతున్న తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీకి జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుతున్నాయని అన్నారు. ఒక ఏడాది కాలంలోనే అనేక క్రీడా కార్యక్రమాలు నిర్వహించి క్రీడా విధానం ప్రకటించి క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్రంగా తెలంగాణ ను క్రీడా ప్రముఖులు ప్రశంసిస్తున్నారని ఆయన తెలిపారు.మరిన్ని క్రీడా కార్యక్రమాలతో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ క్రీడాభివృద్ధికి దోహదం చేస్తుందని ఆయన తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వ క్రీడాల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి, మాట్లాడుతూ, ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోనే వినూత్నమైన విభిన్నమైన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, హైదరాబాద్ నగరంలోనే కాకుండా అన్ని జిల్లా కేంద్రాల్లో క్రీడా శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయని తెలిపారు.జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని ఇటీవల వివిధ క్రీడాంశాల్లో పత కాలు సాధించిన క్రీడాకారులకు నగదు పురస్కారాలతో సన్మానం చేశారు. 41 మంది క్రీడాకారులకు ఒక కోటి 29 లక్షల వరకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు వరల్డ్ ఆర్చరీ అండర్- 21 బంగారు పతకం సాధించిన చికితా తానిపర్తి కి ఐదు లక్షల నగదు పురస్కారాన్ని, పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిని శృతికి ఐదు లక్షల రూపాయల నగదు పురస్కారాన్ని షఉటింగ్ క్రీడాకారిని ఇషా సింగ్ కు నాలుగు లక్షల నగదు పురస్కారాన్ని పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిని తుడి శ్రీ చందనకు 5 లక్షల నగదు పురస్కారాన్ని ఇండియన్ క్రికెట్ టీం ఫీల్డింగ్ కోచ్ టీ దిలీప్ కు 5 లక్షల రూపాయల నగదు పురస్కారాన్ని, జూలై 20 25 సౌత్ కొరియా జీ చైన్ లో జరిగిన 20వ ఆసియన్ రోలర్ స్కేటింగ్ సీనియర్ ఛాంపియన్ షిప్ లో పత కాలు సాధించిన తేజేష్, కాంతి శ్రీ, శ్రియా మురళి,ఎండూరు ఆకాంక్ష, చలంచర్ల జోహిత్, జియా జయేష్ పటేల్, రక్షిత్ మురళి ఎండూరు సంచిత చౌదరి, ప్రతీక్ లకు ఒక్కొక్కరికి ఐదు లక్షల రూపాయల నగదు పురస్కారాలను అందజేశారు.

# భారత్-జపాన్ ఆర్థిక, రక్షణ భాగస్వామ్యం

(మొదటి పేజీ తరువాయి)

ఈ శతాబ్దపు సాంకేతిక విప్లవానికి నాయకత్వం వహిస్తాయని ప్రధాని విశ్వాసం వ్యక్తం చేశారు. భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ అని, భారత్ రాజకీయ- ఆర్థిక స్థిరత్వం, విధానాల్లో పారదర్శకత వంటి అంశాల కారణంగా ప్రపంచ పెట్టుబడి గమ్యస్థానంగా మారిందని మోడీ చెప్పారు. జపాన్ కంపెనీలు భారత్‌లో 40 బిలియన్ల డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టాయని తెలిపారు. 2047 నాటికి భారత్ 100 గిగావాట్ల అణువిద్యుత్‌ను లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. జపాన్‌లో రెండు రోజుల పర్యటన కోసం శుక్రవారం మోడీ టోక్యోకు చేరుకున్నారు. ముందుగా స్పీకర్ ఫుకుషిరో నుకాగా, జపాన్ పార్లమెంట్ సభ్యుల బృందంతో భేటీఅయ్యారు. భారత్–జపాన్ మధ్య స్నేహపూర్వక సంబంధాలపై చర్చించారు. జపాన్ మాజీ ప్రధానులు యోషిహిదే సుగా, ఫ్యూమియో కిషిడాలతో మోడీ సమావేశమయ్యారు. టోక్యోలోని ప్రవాస భారతీయులను మోడీ కలుసుకున్నారు. ప్రవాస భారతీయుల ఆప్యాయత ఎంతోగానో కదలించిందని, జపాన్ సమాజానికి తోడ్పడుతూనే భారత సాంస్కృతిక మూలాలను కాపాడుకోవడంలో ప్రవాస భారతీయుల నిబద్ధత ప్రశంసనీయమని అన్నారు.

# నేషనల్ ఫెన్సింగ్ పోటీల్లో పతకాలు సాధించిన బీసీ గురుకుల విద్యార్థులు

**- క్రీడాపోటీల్లో విశేష ప్రతిభ కనబరుస్తున్న బీసీ గురుకుల విద్యార్థులు**

**- అభినందించిన మంత్రి పొన్నం ప్రభాకర్, కార్యదర్శి బడుగు సైదులు**

**బలగం టీవీ, హైదరాబాద్**

నేషనల్ ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాచుపల్లిలోని మమతా అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ హాస్పిటల్ లో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 17 పోటీలలో బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీల్లో బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు 11 మంది హాజరయ్యారు కాగా సురేఖ వెండి పతకం, మరొక విద్యార్థిని రాణి కాంస్య పతకం సాధించారు. క్రీడా ప్రపంచానికి తెలంగాణ వేదిక కావాలి అన్న ప్రభుత్వ ఆలోచనను బీసీ గురుకుల విద్యార్థులు అనుసరిస్తూ క్రీడా పోటీల్లో పతకాలు సాధించడం అభినందనీయమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. క్రీడా స్ఫూర్తిని విద్యార్థుల్లో పెంపొందిస్తూ వారి ఆసక్తి కి అనుగుణంగా శిక్షణ అందిస్తున్నాం అన్నారు. రానున్న జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే క్రీడా పోటీల్లో బీసీ గురుకుల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పతకాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ, విద్యార్థులను ప్రోత్సహిస్తున్న బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు, జాయింట్ సెక్రటరీ తిరుపతి, కీసరా స్కూల్ ప్రిన్సిపాల్ రాములు గౌడ్ ను అభినందించారు.



# మునిగిపోయిన ఏడుపాయల ఆలయం

**- భక్తులు వెళ్లొద్దని అధికారుల హెచ్చరిక**

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రముఖ దేవాలయం ఏడుపాయల ఆలయం వరద నీటిలో మునిగిపోయింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరద ప్రవాహం ఉధృతంగా కొనసాగుతుండడంతో ఆలయం పూర్తిగా నీటిలో కొట్టుకుపోయింది. దేవాలయం పైవరకు వరద నీరు చేరినట్లు అధికారులు తెలిపారు. దీంతో భక్తులు ఆలయం వైపు రాకూడదని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కుండపోత వర్షాలు కురుస్తుండగా, ముఖ్యంగా కామారెడ్డి, మెదక్, సిద్ధిపేట, నిజామాబాద్ జిల్లాల్లో వర్షాలు దంచికొడుతున్నాయి. కామారెడ్డి పట్టణం పూర్తిగా వరదలతో మునిగిపోయింది. అనేక గ్రామాలు, తండాలు నీటిలో చిక్కుకున్నాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో దారుణ పరిస్థితులు నెలకొనడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నాయి.



# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఓవైసీ సోదరులు

**బలగం టీవీ, హైదరాబాద్**

సీఎం రేవంత్ రెడ్డిని హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఓవైసీ, ఎంఐఎం ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఓవైసీ, మర్కజీ మిలాద్ జులూస్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా పురాతన మసీదులు, దర్గాలను అలంకరించాలని, ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని సిఎంకు వారు విజ్ఞప్తి చేశారు. దీంతోపాటు సెప్టెంబర్ 14 వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శనలకు అనుమతి ఇవ్వాలని కమిటీ సభ్యులు కోరారు.

# అసెంబ్లీ సమావేశాలకు సహకరించాలి

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు సమన్వయంతో పనిచేసి సభ్యులు సరైన సమయానికి సభలకు చేరుకునేలా సహకరించాలని సూచించారు. సభా సమయంలో ధర్నాలు, ఆందోళనలు జరగకుండా ముందస్తుగానే అడ్డుకునేందుకు చర్యలు తీసుకుని, సభలు సజావుగా జరిగేందుకు సహకరించాలన్నారు. కౌన్సిల్ చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర శాసన మండలి సమావేశాలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పని చేయాలని చెప్పారు. అవసరమైన నోడల్ అధికారులు, లైజనింగ్ ఆఫీసర్లను నియమించాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ప్రశ్నలకు వెంటనే సమాధానాలు పంపించాలని సూచించారు. తెలంగాణ పోలీసు దేశంలోనే సమర్ధవంతమైనదని ప్రశంసించారు. వారి ఆధ్వర్యంలో శాసనమండలి సమావేశాలు సజావుగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకష్ణారావు మాట్లాడుతూ సభలు సజావుగా కొనసాగేందుకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామన్నారు. అన్ని శాఖలను సమన్వయం చేస్తూ అవసరమైన అధికారులను అందుబాటులో ఉంచుతామని చెప్పారు. ఇందుకు ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయిలో చర్యలు తీసుకున్నట్టు వెల్లడించారు.

## రాజన్న ఆలయ ఈవోగా ఎల్. రమాదేవి

**బలగం టీవీ, వేములవాడ**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి నూతన కార్యనిర్వహణాధికారి (ఈవో)గా ఎల్. రమాదేవిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు దేవాదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## సెప్టెంబర్ 2న గ్రామ పంచాయతీ తుది ఓటర్ జాబితా విడుదల

### పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రకటన

**బలగం టీవీ, పెద్దపల్లి**



గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం తుది ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాను సెప్టెంబర్ 2న ప్రచురిస్తామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఈ విషయాన్ని వెల్లడించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితా అప్‌డేట్ ప్రక్రియ కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని 263 గ్రామ పంచాయతీల పరిధిలో 2432 వార్డులలో 4,04,209 మంది ఓటర్లతో డ్రాఫ్ట్ ఓటర్ జాబితా ఆగస్టు 28న విడుదల చేసినట్లు చెప్పారు. ప్రతీ గ్రామ పంచాయతీ వారీగా డ్రాఫ్ట్ జాబితా తయారు చేసినట్లు పేర్కొన్నారు.

ప్రజలు, రాజకీయ పార్టీలు ఈ జాబితాను పరిశీలించి ఈనెల 30లోపు అభ్యంతరాలు తెలియజేయాలని, ఆగస్టు 31లోపు వాటిని పరిష్కరించి సెప్టెంబర్ 2న తుది జాబితా ప్రచురిస్తామని అన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి 2432 పోలింగ్ కేంద్రాల డ్రాఫ్ట్ జాబితా కూడా విడుదల చేసినట్లు తెలిపారు. వీటిపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 30లోపు ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీపీవో వీర బుచ్చయ్య, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




## ఒక్క యూరియా బస్తానైన ఇవ్వండి.. మహాప్రభో

- **వేడుకుంటున్న రైతన్నలు..**
- **గాలిపల్లిలో పోలీస్ పహారాలో యూరియా పంపిణీ**

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

యూరియా కోసం రైతులు పడుతున్న కష్టాలు అంత ఇంత కాదు ఒక్క యూరియా బస్తా నైన ఇవ్వండి మహాప్రభో అని దీనంగా వేడుకునే రోజులు వచ్చాయి. ఇల్లంతకుంట మండలం గాలిపల్లి గ్రామంలో యూరియా కోసం ఉదయం నుంచే మహిళలు సైతం బారులు తీరారు. ఇస్తున్న ఒక్క బస్తా సైతం పోలీస్ పహారా లో కట్టుదిట్టం చేయడం తో ఇదేం ప్రజాపాలన అని మహిళ రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పంటకు సరైన సమయం లో యూరియా అందించకపోతే దిగుబడి తగ్గుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతలా జరుగుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం ఏంటని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



## రైలు బడిలో జాతీయ క్రీడా దినోత్సవం

**బలగం టీవీ, కందికట్కూర్**

రైలు బడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, కందికట్కూర్ (ఎస్సీ కాలనీ)లో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవం మరియు తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బద్దం రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, క్రీడలు విద్యార్థులలో శారీరక దృఢత్వాన్ని, మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని వివరించారు. అదేవిధంగా, తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు కథల పఠన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ తాటిపల్లి నిర్మల, ఉపాధ్యాయులు అనుమోజు రాజు, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుపై అసెంబ్లీలో చర్చకు సవాల్..

### గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

### నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వ విప్

**బలగం టీవీ, వేములవాడ**



భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వేములవాడలోని ములవాగు వద్ద గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు పండాలని వేడుకున్నారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ నిర్మించిన నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్, కడెం వంటి ప్రాజెక్టులు వరదలకు సైతం చెక్కుచెదరలేదని, కానీ లక్ష కోట్ల రూపాయలతో నిర్మించామని గొప్పలు చెప్పుకున్న కాళేశ్వరం ప్రాజెక్టు కృంగిపోయిందని విమర్శించారు. వరదల్లో చిక్కుకున్న వారికి సహాయం చేయకుండా కేటీఆర్ రాజకీయాలు చేస్తున్నారని, గత పదేళ్ల మంత్రిగా పనిచేసి కనీసం బ్రిడ్జిలు కూడా కట్టలేకపోయారని ధ్వజమెత్తారు. "నా చర్మం వలిచి సిరిసిల్ల ప్రజలకు చెప్పులు కుట్టిస్తానని పెద్ద మాటలు మాట్లాడిన కేటీఆర్ బ్రిడ్జిలు కూడా నిర్మించలేకపోయారు. నిన్నటి వరదలకు మీ అసమర్థతే కారణం కాదా?" అని ప్రశ్నించారు.

రానున్న అసెంబ్లీ సమావేశాల్లో కాళేశ్వరం ప్రాజెక్టుపై చర్చకు సిద్ధమని శ్రీనివాస్ తెలిపారు. "గుమ్మడికాయ దొంగ ఎవరంటే భుజాలు తడుముకున్నట్లుగా కేసీఆర్, కేటీఆర్ కోర్టుకు వెళ్లి కాళేశ్వరం విచారణపై స్టే ఇవ్వాలని అడిగారు. మీరు తప్పు చేయనప్పుడు మీకు ఎందుకు భయం? దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి కాళేశ్వరంపై చర్చలో పాల్గొనాలి" అని సవాల్ విసిరారు. పిసి ఘోష్ కమిషన్ విచారణను కూడా వారు తప్పుబడుతున్నారని, కేసీఆర్ హరీష్ రావు లను పిసి ఘోష్ కమిషన్ ఒక్కొక్కరిగా విచారించిందని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో అన్ని స్కాములే చేశారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో "గోర్లు, బర్లు, చాపలు వేటినీ వదలకుండా" స్కాంలు చేశారని మండిపడ్డారు.

## తెలంగాణకు యూరియా సరఫరాలో కేంద్రం వైఫల్యం




### సీపీఐ(ఎం) నేత ఎరవెల్లి నాగరాజు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన యూరియా సరఫరా చేయడంలో కేంద్ర ప్రభుత్వం, ముఖ్యంగా కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ పూర్తిగా విఫలమయ్యారని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు ఎరవెల్లి నాగరాజు ఆరోపించారు. కోనరావుపేట మండలం సుద్దాలలో విలేకరుల సమావేశం నిర్వహించి ఎరవెల్లి నాగరాజు మాట్లాడుతూ.. బీజేపీ మంత్రుల నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సొసైటీల వద్ద యూరియా కోసం రైతులు గంటల తరబడి క్యూలలో నిలబడాల్సి వస్తుందని, పంటలు దెబ్బతింటాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారని నాగరాజు తెలిపారు. తెలంగాణకు కేటాయించిన కోటాలో ఇంకా 2.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉందని, దానిని అందించడంలో కేంద్ర బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆయన అన్నారు.

బీజేపీకి రైతుల పట్ల మొదటి నుంచీ చిన్నచూపు ఉందని, గతంలో రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తీసుకొచ్చిందని గుర్తు చేశారు. తెలంగాణ రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆయన ఆరోపించారు. తక్షణమే రైతన్నలకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులను ఏకం చేసి, ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై తీవ్ర పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ నాయకులు మాసం సురేష్, రవి, బాబు, భాస్కర్ రాజు తదితరులు పాల్గొన్నారు.




## రూ.56 లక్షల జీహెచ్ఎంసీ నిధులు కాజేసిన మహిళా కంప్యూటర్ ఆపరేటర్..

**బలగం టీవీ, హైదరాబాద్**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)లో అవినీతి బాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. శేరిలింగంపల్లి జోన్‌లోని చందానగర్ సర్కిల్ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ మహిళా కంప్యూటర్ ఆపరేటర్ ఏకంగా రూ.56 లక్షల నిధులు దుర్వినియోగం చేసినట్లు ఆడిట్ తనిఖీల్లో తేలింది.

చందానగర్ సర్కిల్‌లోని పౌరసేవా కేంద్రంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న సుభాషిణి, ప్రజల నుంచి వసూలు చేసిన పన్నులు, ఇతర రుసుములను జీహెచ్ఎంసీ ఖజానాలో జమ చేయకుండా తన ఖాతాలోకి మళ్లించినట్లు ఆడిట్ అధికారులు గుర్తించారు. ట్రేడ్ లైసెన్స్, జనన మరణ ధృవీకరణ పత్రాలు, ఆస్తి పన్ను దరఖాస్తుల ద్వారా వసూలైన డబ్బులను ఆమె స్వాహా చేసినట్లు నిర్ధారించారు.

2024–25 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటి వరకు రూ.56 లక్షలు దుర్వినియోగం అయినట్లు తేలడంతో, ఆడిట్ జరుగుతుందని తెలిసి సుభాషిణి విధులకు హాజరు కాలేదు. దీంతో, ఉన్నతాధికారులు ఆమెను కార్యాలయానికి రప్పించి ప్రశ్నించగా, నిధులు కాజేసినట్టు అంగీకరించింది. ఆశ్చర్యకరంగా, కేవలం ఒక్క రోజులోనే ఆమె రూ.56 లక్షలను జీహెచ్ఎంసీ ఖాతాలో తిరిగి జమ చేసింది. ఈ ఘటనపై అధికారులు విచారణ జరుపుతున్నారు.



## లోయర్ మానేరు గేట్ల ఎత్తివేత

**బలగం టీవీ, హైదరాబాద్**

మిడ్ మానేరు, ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరద ప్రవాహం లోయర్ మానేరు ప్రాజెక్టుకు చేరుతోంది. దీంతో అధికారులు శుక్రవారం లోయర్ మానేరు డ్యాం గేట్లను ఎత్తివేయనున్నారు. ఈ క్రమంలో దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పశువులు, గొర్రెల కాపర్లు, మత్స్యకారులు నదిలోకి వెళ్లరాదని, రైతులు మానేరు నదిని దాటే ప్రయత్నం చేయవద్దని అధికారులు సూచించారు.

కరీంనగర్ ఇరిగేషన్ సర్కిల్ నంబర్–2 సూపరింటెంట్ ఇంజనీర్ రమేష్ తెలిపారు. రెండు రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మిడ్ మానేరు నుంచి వరద నీరు లోయర్ మానేరు డ్యామ్‌లోకి వస్తోందని, నీటి మట్టం పెరుగుతుండటంతో స్పిల్‌వే గేట్లు ఎత్తి నీటిని వదిలే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఓదెల మండల పరివాహక గ్రామాలైన గుంపుల, ఇందుర్తి, బాయమ్మపల్లి, రూప్‌నారాయణపేట, పోత్కపల్లి, మడక, కనగర్తి, కేశవాపూర్, గుండ్లపల్లి ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని పోత్కపల్లి ఎస్ఐ దీకొండ రమేష్ సూచించారు. ప్రజలు, రైతులు, రైతు కూలీలు, పశువుల కాపరులు, మత్స్యకారులు ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల వారు నదిలోకి వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారుల బృందం మరోసారి హెచ్చరించింది.

# బీసీసీఐ అధ్యక్షుడి రాజీనామా

- **తాత్కాలిక అధ్యక్షుడిగా రాజీవ్ శుక్లా**

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత క్రికెట్‌లో శుక్రవారం పెద్ద మార్పు చోటు చేసుకుంది. భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) అధ్యక్షుడు రోజర్ బిన్నీ తన పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో బోర్డు ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ నిర్ణయం తాజాగా జరిగిన బీసీసీఐ ఏపెక్స్ కౌన్సిల్ సమావేశంలో తీసుకున్నారు.



బీసీసీఐ నిబంధనల ప్రకారం 70 ఏళ్లు పూర్తైన తర్వాత అధ్యక్ష పదవిలో కొనసాగడం సాధ్యం కాదు. రోజర్ బిన్నీ ఇటీవలే 70 ఏళ్లు పూర్తిచేసుకున్నారు. దీంతో ఆయన స్వచ్ఛందంగా రాజీనామా చేయగా, కౌన్సిల్ అధికారికంగా ఆమోదించింది. కొత్త అధ్యక్షుడి ఎన్నికలు వచ్చే నెలలో జరిగే అవకాశం ఉంది. అప్పటివరకు రాజీవ్ శుక్లా తాత్కాలిక అధ్యక్షుడిగా కొనసాగనున్నారు. ఈ పదవికి భారత మాజీ క్రికెటర్లు, రాజకీయ నాయకులు రేసులో ఉన్నట్లు సమాచారం.

క్రికెట్ పరిపాలనలో రాజీవ్ శుక్లాకు విశేష అనుభవం ఉంది. 2015లో ఐపీఎల్ ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2020లో బీసీసీఐ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు ఉత్తరప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శిగా కూడా పనిచేశారు. జర్నలిజం రంగం నుంచి రాజకీయాల్లోకి అడుగుపెట్టిన శుక్లా, ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. కాబట్టి ఆయన క్రికెట్, రాజకీయాల్లోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

# ఆసియా కప్‌లో జెర్సీ స్పాన్సర్ లేకుండానే టీమిండియా..

- **డ్రీమ్ 11 ఒప్పందం రద్దు**

**బలగం టీవీ, హైదరాబాద్**

ఆసియా కప్ ప్రారంభానికి ముందు భారత క్రికెట్ జట్టుకు కొత్త ఇబ్బంది ఎదురైంది. కేంద్రం తీసుకొచ్చిన ఆన్‌లైన్ గేమింగ్ నియంత్రణ చట్టం కారణంగా టీమిండియా జెర్సీ స్పాన్సర్ డ్రీమ్ 11తో ఉన్న ఒప్పందం రద్దయింది. దీంతో ఆసియా కప్‌లో ఈ సారి జెర్సీ స్పాన్సర్ లేకుండానే భారత జట్టు ఆడబోతోంది.

**బీసీసీఐ అత్యవసర సమావేశం**

కొత్త స్పాన్సర్ ఎంపికపై చర్చించేందుకు గురువారం రాజీవ్ శుక్లా నేతృత్వంలో బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సమావేశమైంది. కొత్త స్పాన్సర్ ఎంపిక, బిడ్డింగ్ ప్రక్రియపై చర్చించినా, ఆసియా కప్ సమీపిస్తున్నందున ఇప్పుడే ఒప్పందం కుదుర్చుకోవడం అసాధ్యమని అధికారులు తేల్చారు. వన్డే వరల్డ్ కప్ ప్రారంభానికి ముందే కొత్త జెర్సీ స్పాన్సర్‌ను ఖరారు చేయాలి అన్న అభిప్రాయానికి బీసీసీఐ వచ్చినట్టు సమాచారం.

భారత బోర్డుకు ఈ పరిణామం భారీ ఆర్థిక నష్టంగా మారనుంది. డ్రీమ్ 11 కంపెనీ 2023–26 కాలానికి బీసీసీఐతో కుదుర్చుకున్న రూ.358 కోట్ల ఒప్పందం రద్దయింది. అదేవిధంగా ఐపీఎల్‌లో జెర్సీ స్పాన్సర్‌గా ఉన్న డ్రీమ్ 11తో కూడ ఒప్పందం రద్దయింది. ఈ రెండు సంస్థల నుంచి కలిపి బీసీసీఐకి దాదాపు రూ.1,000 కోట్ల ఆదాయం వచ్చేది.

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వేదికగా జరగబోయే పదిహేడవ ఆసియా కప్‌లో భారత్ ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది. ఇప్పటివరకు ఎనిమిది సార్లు (ఏడుసార్లు వన్డే, ఒకసారి టీ20) ఛాంపియన్‌గా నిలిచిన భారత్ తొమ్మిదో ట్రోఫీపై గురి పెట్టింది. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని జట్టు సెప్టెంబర్ 4న దుబాయ్ చేరుకోనుంది. తొలి మ్యాచ్‌లో ఆతిథ్య యూఏఈతో తలపడనుంది. అనంతరం సెప్టెంబర్ 14న పాకిస్థాన్‌తో, సెప్టెంబర్ 19న ఒమాన్‌తో భారత జట్టు పోరాడనుంది.



# జూరిచ్ డైమండ్ లీగ్‌లో రన్నరప్‌గా నీరజ్ చోప్రా

- **91.51 మీటర్లతో జర్మనీకి చెందిన జూలియన్ వెబర్ విజేత**

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత జావెలిన్ స్టార్, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత నీరజ్ చోప్రా జూరిచ్ డైమండ్ లీగ్‌లో రన్నరప్‌గా నిలిచాడు. స్విట్జర్లాండ్‌లో జరిగిన ఈ టోర్నీలో జర్మనీ ఆటగాడు జూలియన్ వెబర్ 91.51 మీటర్ల దూరం విసిరి విజేతగా నిలిచాడు. నీరజ్ తన చివరి ప్రయత్నంలో 85.01 మీటర్ల దూరం బల్లెం విసిరి రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ట్రినిడాడ్ అండ్ టొబాగోకు చెందిన కెషోర్న్ వాల్‌కాట్ 84.95 మీటర్లతో మూడో స్థానంలో నిలిచాడు.

వెబర్ తొలి ప్రయత్నంలోనే 91.37 మీటర్లు, రెండో ప్రయత్నంలో 91.51 మీటర్లు విసిరి అద్భుతం చేశాడు. నీరజ్ మొదటి రెండు ప్రయత్నాల్లో వరుసగా 84.35, 82 మీటర్లు విసిరాడు. తరువాతి మూడు ప్రయత్నాల్లో ఫౌల్ అయ్యాడు. చివరి ప్రయత్నంలో 85.01 మీటర్లు విసరడంతో రెండో స్థానాన్ని కాపాడుకున్నాడు. వాల్‌కాట్ చివరి ప్రయత్నంలో కేవలం 78.30 మీటర్లే విసరడంతో మూడో స్థానంతో సరిపెట్టుకున్నాడు.

**వరల్డ్ నెం.1 నీరజ్**

ప్రస్తుతం వరల్డ్ నెం.1 ర్యాంక్‌లో ఉన్న నీరజ్, 2022లో జూరిచ్ డైమండ్ లీగ్ ఫైనల్లో తొలిసారి విజేతగా నిలిచాడు. అనంతరం 2023, 2024లో రెండో స్థానంలో నిలిచాడు. ఈ సీజన్‌లో దోహా డైమండ్ లీగ్‌లో తొలిసారి 90 మీటర్ల మార్క్‌ను దాటాడు. జూలియన్ వెబర్ (91.51 మీ) తన కెరీర్ బెస్ట్‌ను నమోదు చేశాడు.

"నా ప్రదర్శన చెత్తేమీ కాదు. కానీ ప్రపంచ ఛాంపియన్‌షిప్ దగ్గరపడుతుండటంతో ఇంకా బల్లెం దూరంగా విసరాలి. వెబర్ ఈరోజు అద్భుతంగా విసిరాడు. అతనికి నేను సంతోషిస్తున్నాను" అని నీరజ్ అన్నారు. "ప్రపంచ ఛాంపియన్‌షిప్ కోసం మరింత శిక్షణ పొందాలి. టోక్యోలో నాకు స్నేహితులు వస్తారు, ఇది నాకు ప్రత్యేక ఉత్సాహాన్ని ఇస్తుంది. పతకాన్ని గెలిచేలా నా వంతు కృషి చేస్తాను" అని నీరజ్ చోప్రా స్పష్టం చేశాడు.

# దులీప్ ట్రోఫీలో సరికొత్త చరిత్ర

**బలగం టీవీ, హైదరాబాద్**



దులీప్ ట్రోఫీ 2025లో జమ్మూ కశ్మీర్ ఫాస్ట్ బౌలర్ ఆకిబ్ నబీ దార్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. నార్త్ జోన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న అతడు ఈస్ట్ జోన్‌తో జరిగిన మ్యాచ్‌లో నాలుగు బంతుల్లో నాలుగు వికెట్లు పడగొట్టి అరుదైన రికార్డు సాధించాడు. ఈ ఘనత సాధించే క్రమంలో ఆకిబ్ హ్యాట్రిక్ కూడా నమోదు చేశాడు. దులీప్ ట్రోఫీ చరిత్రలో ఇప్పటి వరకు కేవలం ఇద్దరు బౌలర్లు మాత్రమే హ్యాట్రిక్ తీశారు. 1978/79 సీజన్‌లో కపిల్ దేవ్, 2000/01 సీజన్‌లో సాయిరాజ్ బహుతులే ఈ రికార్డు సాధించారు. ఇప్పుడు ఆకిబ్ నబీ వారితో పాటు మూడో బౌలర్‌గా నిలిచాడు. అంతేకాకుండా దులీప్ ట్రోఫీలో నాలుగు బంతుల్లో నాలుగు వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా నిలిచి ప్రత్యేక రికార్డు నెలకొల్పాడు.

**ఆకిబ్ ప్రదర్శన ఇలా సాగింది**

53వ ఓవర్ చివరి మూడు బంతుల్లో వరుసగా విరాట్ సింగ్ (బౌల్డ్), మనిశి (ఎల్బీడబ్ల్యూ), ముక్తార్ హుసేన్ (బౌల్డ్) వికెట్లు

55వ ఓవర్ తొలి బంతికి సూరజ్ జైస్వాల్ (వికెట్‌కీపర్ క్యాచ్) వికెట్

దీంతో నాలుగు బంతుల్లో నాలుగు వికెట్లు సాధించాడు.

ఆ తర్వాతి ఓవర్‌లో మొహమ్మద్ షమీని ఔట్ చేసి ఐదు వికెట్ల ఘనత నమోదు చేశాడు.

ఆకిబ్ బౌలింగ్ ధాటికి ఈస్ట్ జోన్ ఇన్నింగ్స్ 230 పరుగులకే కుప్పకూలింది. ఒక దశలో 7 పరుగుల వ్యవధిలో ఐదు వికెట్లు కోల్పోయింది.

ఈస్ట్ జోన్ ఇన్నింగ్స్: విరాట్ సింగ్ (69), రియాన్ పరాగ్ (39), ఉత్కర్ష్ సింగ్ (38) కొంత ప్రతిఘటన చూపినా జట్టు పెద్ద స్కోరు చేయలేకపోయింది.

నార్త్ జోన్ తొలి ఇన్నింగ్స్: 405 పరుగులు చేసింది. కన్హయ్య (76), ఆయుశ్ బదోని (63) అర్ధ సెంచరీలతో మెరిశారు.

దులీప్ ట్రోఫీలో తన అరంగేట్రం మ్యాచ్‌లోనే ఆకిబ్ నబీ ఈ రికార్డు నమోదు చేయడం ప్రత్యేకతగా నిలిచింది.

# భారీ సినిమాలను దాటేసిన 'మహావతార్ నరసింహ'

**బలగం టీవీ, హైదరాబాద్**



భారతీయ సినిమా చరిత్రలో యానిమేషన్ చిత్రాలు భారీ విజయాలు సాధించడం చాలా అరుదు. అయితే ఆ అంచనాలను తలకిందులు చేస్తూ కొత్త దర్శకుడు అశ్విన్ కుమార్ రూపొందించిన 'మహావతార్ నరసింహ' బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. కేవలం రూ. 40 కోట్ల బడ్జెట్‌తో ఎటువంటి అంచనాలు లేకుండా విడుదలైన ఈ చిత్రం, గురువారంతో 35 రోజులు పూర్తి చేసుకుంది. ఈ వ్యవధిలో ప్రపంచవ్యాప్తంగా రూ. 310 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించి అందరినీ ఆశ్చర్యపరిచింది. భారతదేశంలోనే ఈ సినిమా రూ. 238.25 కోట్ల నెట్ (రూ. 282.50 కోట్ల గ్రాస్) సంపాదించింది. 'వార్ 2', 'కూలీ' వంటి భారీ సినిమాలు థియేటర్లలో ఉన్నప్పటికీ, ఐదో వారంలో కూడా రూ. 18.50 కోట్లకు పైగా కలెక్ట్ చేయడం విశేషం. విదేశాల్లోనూ, ముఖ్యంగా ప్రవాస భారతీయులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఈ చిత్రం 3 మిలియన్ డాలర్లకు పైగా వసూళ్లు రాబట్టింది.

ఇంతకుముందు రజినీకాంత్ నటించిన 'కొచ్చాడియాన్' (రూ. 30 కోట్లు) యానిమేషన్ చిత్రాల్లో అగ్రస్థానంలో ఉండగా, 'మహావతార్ నరసింహ' ఆ రికార్డును భారీ తేడాతో అధిగమించింది. ఈ యానిమేషన్ చిత్రం కేవలం జానర్ రికార్డులనే కాకుండా, కొన్ని లైవ్ యాక్షన్ భారీ చిత్రాల వసూళ్లను కూడా దాటేసింది. బాలీవుడ్‌లో విజయం సాధించిన 'సూర్యవంశీ' (రూ. 300 కోట్లు), 'ది కేరళ స్టోరీ' (రూ. 304 కోట్లు) వంటి చిత్రాల కలెక్షన్లను అధిగమించింది. భారత్‌లో డిస్నీ, సోనీ, మార్వెల్ వంటి హాలీవుడ్ యానిమేషన్ చిత్రాలకన్నా కూడా ఎక్కువ వసూళ్లు సాధించింది. ఉదాహరణకు, 'స్పైడర్ మ్యాన్: అక్రాస్ ది స్పైడర్ వెర్స్' భారత్‌లో రూ. 56 కోట్లు మాత్రమే వసూలు చేసింది. విష్ణుమూర్తి దశావతారాల ఆధారంగా ఏడు భాగాలుగా రానున్న 'మహావతార్ సినిమాటిక్ యూనివర్స్' లో ఇది మొదటి చిత్రం. నరసింహావతారం, ప్రహ్లాదుడి కథ ఆధారంగా హొంబళే ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది. పిల్లలు, కుటుంబ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో ఈ సినిమా అనూహ్య విజయం సాధించింది. ఈ విజయంతో రాబోయే 'మహావతార్ సిరీస్' చిత్రాలపై అంచనాలు మరింత పెరిగాయి.

# చిరంజీవిని కలిసేందుకు సైకిల్‌పై వచ్చిన మహిళ

**బలగం టీవీ, హైదరాబాద్**



మహోన్నత వ్యక్తిత్వం, అపారమైన సేవాతత్వంతో కోట్లాది మందికి ఆదర్శంగా నిలుస్తున్న మెగాస్టార్ చిరంజీవి మరోసారి తన మానవతా హృదయాన్ని చాటుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఆదోని పట్టణానికి చెందిన వీరాభిమాని రాజేశ్వరి, చిరంజీవిని ఒక్కసారి ప్రత్యక్షంగా కలవాలన్న తపనతో సైకిల్‌పై ఆదోని నుంచి హైదరాబాద్ వరకు సాహసోపేత యాత్ర ప్రారంభించారు. శారీరక, మానసిక ఇబ్బందులను ఎదుర్కొన్నప్పటికీ, చిరంజీవిపై ఉన్న అభిమానమే ఆమెకు బలం గా నిలిచింది. ఈ విషయం తెలుసుకున్న చిరంజీవి, రాజేశ్వరిని స్వయంగా ఆహ్వానించి, తన అభిమానానికి గుర్తుగా చీరను బహుకరించారు. అంతేకాకుండా, ఆమె పిల్లల విద్యా భారం తానే భరిస్తానని హామీ ఇచ్చారు.రాజేశ్వరి తన పిల్లలతో కలిసి చిరంజీవిని కలిసినప్పుడు, ఆయనకు రాఖీ కట్టి తన అన్నయ్యలా భావిస్తున్నట్టు తెలిపారు. దీనికి స్పందించిన చిరు, సాంప్రదాయబద్ధంగా ఆమెకు ఆశీర్వాదాలు అందించి, చీర బహుమతిగా ఇచ్చారు.

చిరంజీవి యొక్క ఈ గొప్ప మనసు మరోసారి అభిమానులను కట్టిపడేసింది. "అభిమానులను కేవలం అభిమానులుగానే కాకుండా కుటుంబ సభ్యుల్లా చూసుకునే చిరంజీవి నిజంగా మహానటుడు, మహామనిషి" అని నెటిజన్లు సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ప్రస్తుతం చిరంజీవి "విశ్వంభర" సినిమా షఉటింగ్‌లో బిజీగా ఉన్నారు. అలాగే అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న "మన శంకర వరప్రసాద్" చిత్రం కూడా వేగంగా షఉటింగ్ దశలో కొనసాగుతున్నట్టు సమాచారం.

# మోగ్లీ' గ్లింప్స్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**




'బబుల్‌గమ్' సినిమాతో హీరోగా ఎంట్రీ ఇచ్చిన రోషన్ కనకాల (నటుడు రాజీవ్ కనకాల, యాంకర్ సుమ కనకాల కుమారుడు) తాజాగా నటిస్తున్న చిత్రం 'మోగ్లీ' . ఈ సినిమా అడవిలో సాగే ప్రత్యేకమైన ప్రేమకథగా తెరకెక్కుతోంది. 'ది వరల్డ్ ఆఫ్ మోగ్లీ' పేరుతో విడుదల చేసిన గ్లింప్స్‌ను ప్రముఖ హీరో రామ్ చరణ్ ఆవిష్కరించారు. "25 సంవత్సరాలు నిండని ఓ కుర్రాడు 30 మందిని తిండి, నిద్ర లేకుండా పరిగెత్తించాడు" అంటూ నాని వాయిస్‌తో టీజర్ ప్రారంభమైంది.'కలర్ ఫోటో' ఫేమ్ సందీప్ రాజ్ దర్శకత్వం వహించగా, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై నిర్మించారు.